# ఏజాతి నాగరికతతో?



ఎ. రేవతి

చల్లగాలి రివ్వుమని వీస్తోంది ఆకులు, కొమ్మలు వూగిపోతున్నాయి అంతకంతకూ తుఫానుగాలి విజృంభిస్తోంది. ఆకాశం మేఘావృతమై వుంది. కనుచూపు మేరలో ఆకాశం కనిపించడంలేదు మెల్లగా సన్నని తుంపర కిటికీలోనుండి గదిలోకి పడుతోంది. లేచి కిటికీ ముయ్యాలంటే బద్ధకంగా వుంది

చేతిలోని సైన్సు ఫిక్షను సోఫాలో పక్కన పెడుతూ, ఒళ్లు విరుచుకుంటూ లేచాను బద్ధకంగా. నా కెందుకో మొదటినుండీ సైన్సు ఫిక్షన్లంటే వల్లమాలిన అభిమానం లేనిది వున్నట్లు ఊహించి కళ్ళకు కట్టినట్లు అభూత కల్పనలు చేసి చూపడం కూడా ఒక ఆర్టేకదా! ఈ సమస్యల్లోంచి, బాధల్లోంచి కాస్సేపైనా తప్పించుకుని ఆ కల్పనా జగత్తులో విహరించడానికి ఇది ఒక సోపానమేమో అనిపిస్తుంది అప్పుడప్పుడు

ఎవరూ లేనివారికి పుస్తకాలే మంచి నేస్తం తల్లిలా తన ఒడిలోకి తీసుకుని, సేదదీర్చి, లాలించి, బుజ్జగిస్తాయి మంచిపుస్తకం చదువుతున్నంత సేపూ ఎంత ఆనందమో! ఒక్కోసారి ఆ ఆనందం ఇట్లే మాయమైపోతున్నట్లు అనిపిస్తుంది అలాంటప్పుడు బాధ కలిగినా బ్రతుకులో అదొక మరపురాని అనుభూతిగా మిగిలిపోతుంది

అయ్యో, వర్షం పెద్దదైంది గదంతా జల్లు పడుతోంది నాదంతా ఊహాజగత్తని మా వాళ్ళు హేళన చేస్తారు ఏంచెయ్యను మరి నాకు నిజ జీవితంకంటె ఫిక్షన్ ఎక్కువ ఇష్టం అని ముందే చెప్పానుగా.

కిటికీ మూస్తూంటే యధాలాపంగా నా కళ్ళు ఎదురింటివైపు చూసాయి ఒక్కసారి జుగుప్స అసహ్యం చోటుచేసుకున్నాయి ఎదురింటి గేటు ముందు ఫారెనుకారు ఆగింది అందులోనుండి సుతారంగా దిగింది ఇంగ్లీషు దొరసాని బొద్దుగా గులాబిరంగు ఒళ్లు, బాబ్డ్ హెయిర్, గులాబిరంగు ష్రిల్‌ఫ్రాక్, చెవులకి పూసలన్నద్దులు, చేతిలో వేనిటీ బేగ్, హైహీల్స్.

ముత్తానికి అప్పుడే విరబూసిన గులాబిలా వుందావిడ ఇది ఏరకం అందమో నాకు అంతు చిక్కదు కానీ పాశ్చాత్యుల దృష్టిలో మాత్రం ఖచ్చితంగా ఆవిడ వీనస్ అయివుంటుంది అంత వరకూ గ్యారంటీ ఇవ్వగలను

ఆవిడ ఎప్పటిలాగే చిరునవ్వుతో మా కిటికీ వైపు చూసింది అంతే కట్టలు తెంచుకున్న కోపంతో — కాదు బలంతో కిటికీ తలుపులు మూసేసాను సోఫా ఒడిలో తల దాచుకున్నాను

భర్త ఉద్యోగ రీత్యా విశాఖపట్నం వదిలిపెట్టి మద్రాసు మహానగరంలో ఎనిమిదేళ్ల క్రితం కాలు పెట్టాను అదంతా అరవ సామ్రాజ్యం కావడంతోనూ, మొదటి నుండీ నా కంతగా స్నేహాలంటే ఇష్టం లేకపోవడంతోనూ నా ఒంటరితనం మరింత ఒంటరితనమైంది

విశాఖపట్నంలో ఉన్నప్పుడు తరచుగా బీచి కెళుతూ వుండేదాన్ని అలా ఒంటరిగా సముద్రపు ఒడ్డున కూర్చున్నప్పుడు ఎన్ని ఊహాలని? సముద్రమెంత అగాధమైనదో నా ఊహాలు అంతటి విశాలమైనవి అలా సముద్రతీరంలో కూర్చుని చూస్తే ఏదో మనస్సుకి తెలియని, కనిపించని అనిర్వచనీయమైన సౌందర్యం ఆ కడలి కెరటాలలో కనిపించేది అటువంటి సౌందర్యం ప్రకృతి వరప్రసాదం కాదూ అనిపించేది

అసలు ఈ ప్రకృతి అంటే ఏమిటి? అది ఎలా ఏర్పడింది? నాకన్నీ ప్రశ్నలే జవాబు తెలిసినా, తెలియక పోయినా మనస్సు మాత్రం వీటి చుట్టూ పరుగులు తీయకమానదు ఇదొక చిత్రమైన మెంటాలిటీ ఏమో! అవునూ నేనే ఇలా ఆలోచిస్తానా లేక నాలాగ ఇంకా ఎవరైనా

అవునూ ప్రకృతి అంటే మొక్కలూ, మహావృక్షాలు, కొండలూ, కోనలూ, నదులూ, లోయలూ, సముద్రాలు, పశుపక్ష్యాదులు ఇవన్నీ కలిపితే ప్రకృతే కదూ! అయితే ఇవన్నీ ఎలా ఉద్భవించాయి అబ్బ! ఒక ప్రశ్నకి జవాబు దొరికితే మరో ప్రశ్న

వసంతాలు గడిచిపోతున్నాయి ఋతువులు మారిపోతున్నాయి ఎన్ని మారుతున్నా కాలగమనం ఆగదు కదా! ఏమిటిదంతా? ఏదో మాయ అంతే కదూ!

నేనే కనుక చిత్రకారిణినైతే ప్రకృతిని ఎనలైజ్ చేస్తూ వాటిని అనేక కోణాల్లో, అనేక రకాలుగా కాన్వాసు మీద బంధించి — నా ప్రకృతి ఆరాధనని, అభిమానాన్ని, అభిరుచుల్ని బహిర్గతమయ్యేలాగ చిత్రించి నా కళ్లకెదురుగా వుంచుకుని తన్మయావస్థలో లీనమైపోనా? నా పేరు చిత్ర అని పెట్టారే — మరి పేరుకు తగ్గట్టు చిత్రకారిణిగా నన్నెందుకు దీవించలేదు భగవాన్

అయినా ఇప్పుడేమయిందని అవన్నీ నా గుండె గోడలపై చెరగని ముద్రలుగా చిత్రించుకున్నాను అంతకంటే నాలాంటి సామాన్యురాలు చేయగలిగిందేముంది కనుక

తలుపు చప్పుడవడంతో ఉలిక్కిపడి లేచాను వాచీ చూస్తే సమయం ఆరు అవస్తోంది అరే శ్రీ వారొచ్చే వేళైందే! ఏమిటో పిచ్చివూహాలూ నేనూ తలుపు తీసాను — ఎదురుగా శ్రీవారు, వారి కఠినమైన చూపులు

"మా ఫ్రెండు ఇంట్లో రాత్రి మేరేజ్ రిసెప్షన్ త్వరగా రెడీ అవ్వు సంగిలా తయారవ్వక మొన్న నేను ఢిల్లీనుండి తెచ్చిన గ్రీన్ బెనారస్ ఆర్గంజా చీర కట్టుకుని, పచ్చలసెట్టు పెట్టుకో"

ఆర్డర్లు జారీ అవుతున్నాయి

మనస్సు ఉడికిపోతోంది

తలుపు తీయగానే సరదాగా నవ్వడం, బుగ్గ మీద చిటికేస్తూ గుసగుసలాడడం, ఓరచూపులు చూస్తూ కౌగిలిలో బంధించడం, కొంగుపట్టుకు లాగడం — ఛీ ఒక్కటీలేదు పోలీసు చూపులు, మిలటరీ ఆర్డర్లు అవునూ నేనే ఇలాగా — లేక నాలాగి ఇంకా

అవును ఆయన చెప్పినట్లు తయారవ్వాలి గ్రీన్ బెనారస్ ఆర్గంజావే కట్టుకోవాలి పచ్చల సెట్టే పెట్టుకోవాలి ఇందుకు ఏ మాత్రం విరుద్ధంగా జరిగినా మాటల వాక్బాణాలు వాటిని విని తట్టుకునేశక్తి ఈ చిన్న గుండెకి ఏనాడో పోయింది

గుండె పొరల్లో గతం కదలాడింది మద్రాసులో కాపురం అనగానే మనస్సు పరవశించింది విశాఖపట్నం సముద్రం వదులుతున్నందుకు బాధ కలిగినా, మద్రాసులోకూడా బీచ్ వుందని ఆశపడ్డాను మైలాపూర్‌లో ఇల్లు అనేసరికి బీచ్‌దగ్గరని సంబరపడ్డాను

ఒకరోజు ఆయన ఇంటికి లేటుగా వస్తానేసరికి బీచ్ గుర్తుకొచ్చింది ఏమీతోచక ఆ సాయంత్రం క్రీంకలర్ షిషాన్‌జార్జెట్ చీర కట్టుకొని, శృతిమించని మేకప్ చేసుకుని సముద్రం చూడాలనే ఉబలాటాన్ని అణుచుకుంటూ బీచికి బయలుదేరాను

తాళం వేస్తూంటే ఆయన స్కూటరు గేటు ముందు ఆగింది సరే ఇద్దరం కలిసే వెళ్ళచ్చు అనుకున్నాను మిలిటరీ కళ్లతో ఎక్కడికన్నట్లు ప్రశ్నించి లోపలికి రమ్మన్నారు

చూడ్డానికి నా కంటె ఎంతో పెద్దవారిలా వుండరు కానీ ఆయన ప్రతి కదలిక ఎంతో పెద్ద మనిషిలా వుంటుంది

కొత్తగా పెళ్లైన జంటలో వుండవలసిన చిలిపితనం, సరదాలు అవీ ఏం లేనట్లే అనిపిస్తుంది ఆయనని చూస్తే

ఈ లోకంలో మేమిద్దరం మాకిద్దరు — ఇంక ఎవరూ లేరు అన్నట్లుగా మాకూ అంటూ ఒక చిన్న ప్రపంచాన్ని సృష్టించుకుని సరదాగా జాలీగా లైఫ్ ఎంజాయ్ చెయ్యాలనిపిస్తుంది కానీ వారికి ఆ ధ్యాసే లేదు బయటి ప్రపంచం ఎక్కువ నా ఆశయానికి గొడ్డలిపెట్టు అని సరిపెట్టుకోవడం కంటే చేయగలిగిందేముంది గనుక

"ఎక్కడికి వయ్యారంగా బయలుదేరావు" కటువుగా వినిపించింది మిలటరీ ఘర్జన

ఉలిక్కిపడ్డాను

"అలా చల్లగాలికి బీచ్ కెళదామని" మెల్లగా చెప్పాను

"ఏం చల్లగాలి డాబా మీదకి రానంటోందా?" హేళన ధ్వనించింది

"నాకు మొదటి నుంచి సముద్రమంటే ఇష్టం మా వైజాగ్‌లో "

"మీ వైజాగ్‌లో వూరేగేవని — ఇక్కడ కూడా ఇలా వళ్లంతా కన్పించే షిఫాన్లు అవీ కట్టుకుని రోజూ సాయింత్రాలు బీచిలో వయ్యారాలు ఒలకబోయడం కుర్రకారుని ఆకర్షించాలనా, గూండాలని రెచ్చగొట్టాలనా, నడు ఇంట్లోకి"


ఛీ! ఎంత మానర్‌లెస్‌గా మాట్లాడుతున్నారు


శరీరం కంపిస్తూంటే, పెదవులు వణుకుతూంటే, అవమాన భారంతో, నిస్సహాయంగా కిచెన్‌లోకి పరుగుతీసాను

రోజూ కొంచెం కొంచెంగా చాలా అర్థమయ్యేరు ప్రతి రోజూ ఏదో ఒక అవమానం మనస్సుకి కత్తికోత ఆశయాలకి గొడ్డలిపెట్టు మనస్సు ఏనాడో చచ్చిపోయింది కేవలం కట్టె మాత్రం బ్రతుకుతోంది

మానసికంగా ఎంతో కృంగిపోయి, కుమిలిపోతున్నాను

ఇదిగో — సరిగ్గా ఇలాంటి పరిస్థితిలోనే ఆవిడ అదే ఆ ఇంగ్లీషు లేడీ మా ఎదురింట్లో నాకు




కష్పించింది. ఎప్పటి నుండి వుందో నాకు తెలియదు. కానీ నేను గమనించింది ఈ మధ్యనే.

అందమైన చిన్ని భవనం, చుటూ పెద్ద గార్డెను. అందులో రకరకాల మొక్కలు. రోజూ ఆ చెట్ల చుట్టూ చెత్తాచెదారం క్లీన్ చేయించేది మాలిచేత.

ప్రతిరోజూ ప్రొద్దున సాయంత్రం స్వయంగా ఆవిడ ఆ చెట్లకి సంరక్షణ చేసేది. రోజూ వాటిని కత్తెరతో, కత్తితో కట్ చేస్తూండేది. ప్రతి ఆకూ కొమ్మా పెరగడంతోనే బలైపోయేవి. ఒక్కొక్కసారి మొక్కని బయటకి తీసి వ్రేళ్లని కత్తిరించి మళ్లీ పాతిపెట్టేసేది.

ఏమిటో పిచ్చిమనిషి. ఎప్పుడూ పిచ్చికి చెట్లగోలే. అవునూ. అంత శ్రద్ధగా సంరక్షణ చేసినా ఆ మొక్కలు మొక్కలుగానే వున్నాయి తప్పించి ఎదగవేమిటి? మిస్టరీ అర్థం కావడంలేదు.

ఒకరోజు మా కజిన్ వచ్చేడు. బాల్కనిలో నించొని అవీ ఇవీ మాట్లాడుకుంటూ నవ్వుకుంటు న్నాం. అదే సమయానికి శ్రీవారు వచ్చేరు.

''ఏమిటి ఆ విరగబడి నవ్వడం. బాడీ ఎక్స్‌పోజ్ చెయ్యడమే నా ధ్యేయం అనుకుంటే అంతలా నవ్వకుండానే చెయ్యొచ్చుగా'' నన్నుద్దేశించి అంటూ విసురుగా గదిలోకి వెళ్ళిపోయేరు.

మా కజిన్ మొహంలో కత్తివేటుకి నెత్తురు చుక్కలేనట్లు అయింది. నేను ఈ అవమానాలకి అలవాటు పడ్డదాన్ని కదా! నిమిషంలో తేరుకున్నాను.

ఇంతలో ఇంట్లోంచి వస్తోంది మా కసాయిది. ఇంగ్లీషు దొరసానికి ఈ మధ్య కసాయి అని పేరు పెట్టుకున్నాను ముద్దుగా. చేతిలో కత్తులూ, కటార్లు, నీళ్ల జగ్గులు, టబ్‌లూ ఒకటేమిటి అన్ని పరంజామాలతో హంగామాగా బయటకి వచ్చింది. ఎన్నాళ్లనుండో తెలుసుకోవాలనుకున్న ప్రశ్నకి జవాబు తెలుసుకోవాలి పరిస్థితి అంత బాగులే నప్పటికీ.

''శరత్'' మృదువుగా పిలిచేను.

''ఊ'' భారంగా తలెత్తాడు. ఇంకా అవమానపు ఛాయలు పోలేదు.

''ఇదిగో ఆ ఎదురింటి దొరసానిని నాలుగేళ్ల నుంచీ గమనిస్తున్నాను. ఆవిడ ప్రతిరోజు పొద్దున్న



# ఏజాతి నాగరికతో ?

సాయంత్రం ఆ చెట్లని చిత్ర హింసలు చేస్తుంది. పెరిగిన ప్రతి ఆకు, కొమ్మని కత్తిరించడం ప్రతి రోజూ ద్విగుణీకృతమైన ఉత్సాహంతో ముక్కలు ముక్కలుగా చెయ్యడమే కాకుండా ఏదో పైశాచికానందం అనుభవిస్తున్నట్లు తనలో తను నవ్వుకుంటూ వచ్చిన వారికి ఆ మొండి చెట్లను గురించి ఉత్సాహంగా ఏదో చెప్పడం, ఈ కసాయిదానికి తగ్గట్టు వచ్చినవాళ్ళు కూడా ఆవిడని మెచ్చుకోవడం, కిలకిలా నవ్వులు తర్వాత షేక్‌హాండ్లు, వీడ్కోళ్ళు. ఆ మొక్కలు మాత్రం ఎప్పటికీ అంతే! అవి పెరగవు. అసలిపాటికి ఆ మొక్కలు ఎంత పెద్దవ్వాలని. ఏమిటీ మిస్టరీ? ఏమిటీ ఆనందం? నీకు ఏమైనా తెలుసా ?''

ఉండబట్టలేక సమయం, సందర్భం కానప్పటికీ అతని మనస్సు బాగులేనప్పటికీ ఆవేశం పట్టలేక అడిగేసాను.

అతను తల పంకించి ఓసారి కసాయి గార్డెను పరిశీలించాడు. అర్థమైనట్లు నన్ను చూసేడు. ఏమిటన్నట్లు కళ్ళతో ప్రశ్నించాను.

''దానిని బోన్‌సాయి అంటారు.

''ఏమిటి నేను కసాయి అంటే నువ్వు బోన్ సాయి అంటావు. ఆటపట్టిస్తున్నావా ?''

''అవునవును ఆట పట్టించినట్లే వుంది నా పరిస్థితి. నేను రేపు హౌరా మెయిల్‌కి వైజాగ్ వెళ్ళిపోతున్నాను. ఆఁ, అడిగేవుకాబట్టి చెప్తున్నాను. ఆ చెట్లని పెంచే పద్ధతిని బోన్‌సాయి అంటారు. అది జపానువారి ఆర్టు. వెయ్యి సంవత్సరాల క్రితం ఉద్భవించింది. మొక్కలని పెరగనీయకుండా వచ్చిన ప్రతి ఆకుని, కొమ్మని నరికివేస్తూంటే ఎన్నాళ్ళైనా అది గుబురుగా అంతే వుంటుంది. పెరగదు'' అని చెప్పి ఇంట్లోకి వెళ్ళిపోయేడు.

హు, ఎంత కఠినమైన ఆర్టు. ఆర్టు పేరుతో ఆ చెట్లను నిర్దాక్షిణ్యంగా చిత్రహింసలపాలు చేస్తూంటే... ఒహ్, ఎంతటి నరకయాతన. నరకం అంటే ప్రత్యక్షంగా కనిపిస్తోంది. అన్ని చెట్ల లాగా ఏపుగా ఎదిగి మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లవలసిన చెట్టు ఎదగని మోడై నాశనమవడానికి కారణం ఆ చెట్ల తలరాతా లేక అవి కసాయి చేతిలో పడ్డ నేరమా ?

అన్నట్లు ఈ బోన్‌సాయి వృక్షాల్లాగే మనలో ఎంతమంది ఆడపిల్లలు ఈ రంపపుకోతని భరించడంలేదు. భర్తల, అత్తమామల, ఆడబిడ్డల చిత్రహింసల్ని ప్రత్యక్ష నరకంగా అనుభవిస్తూ ఎంతమంది ఆడపిల్లలు కుమిలిపోవడం లేదు. అంతులేని వేదనను మనస్సులో భరించి మానసికంగా కృంగిపోవడంలేదు.

ఒకసారి పెళ్ళైతే కష్టమైనా నష్టమైనా అతని దగ్గరే పడివుండాలన్నది మన సమాజ సాంప్రదాయం కదూ ! గడిచిన ప్రతి క్షణాన్ని, చవిచూసిన ప్రతి అవమానపు అనుభవాల్ని గుర్తుచేసుకుంటూ, సున్నితమైన గుండెను ముక్కలు ముక్కలుగా నరుకుతూంటే ఇంక ఆ జీవితానికి మిగిలిందేమిటి?

వెన్నెల చల్లదనం— మల్లెల సౌరభం— ప్రతి కదలికలో అందాన్నిచ్చే అందమైన రూపం ఇవన్నీ కలిసి మూడు పువ్వులూ ఆరు కాయలుగా వుండవలసిన జీవితం గుండెకోతకు గురై, అవమానాలపాలై, ఆశలు బలైతె మిగిలేది మోడుకాక మరేమిటి ?

అవునూ, ఇది ఏ రకం ఆర్టుకి సంబంధించినది. ఏ జాతి నాగరికతలో ఉద్భవించింది? ఎన్ని సంవత్సరాల క్రితం ఆవిర్భవింపబడినది. ఎవరిద్వారా అవతరించింది? ఎన్ని ప్రశ్నలు?

భగవంతుడా ! బహుశా నువ్వు కూడా జవాబు చెప్పలేవేమో !

ఒక విధంగా దీన్ని కసాయి ఆర్టు అనవచ్చు కదూ ! మగవాడిజాత్యహంకారంలో ఉద్భవించింది. ఒక జాతి, ఒక నాగరికత, ఒక దేశం, ఒక ప్రాంతం, ఒక నిర్ణీత కాలం అని లేకుండా అనాది నుండి తరతరాలుగా పురుషునితో పాటే వారసత్వం లాగ సంక్రమించే కసాయి ఆర్టు ఇది.

ఈ సంఘర్షణలో నిర్లిప్తంగా చదరంగంలో పావులా వుండడం తప్పించీ, బాధ్యత తెలిసిన ఒక గృహిణి చేయదగింది ఏముంది గనుక ?

ఆకాశంలో దట్టమైన మబ్బులు ముసురుతున్నాయి. మెరుపులు మెరిసి మాయమవుతున్నాయి. కుండపోతగా వర్షం ప్రారంభమైంది.

దారితెన్నూలేని, అంతులేని ఆలోచనలకి, వైవిధ్యమైన ఊహలకి కళ్ళెం వేసి సగం చదివి వదిలిన శిక్షను తీసుకున్నాను సోఫాలో కూర్చుంటూ... ★